సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 26 । ఆగస్టు । 2024



జల భారం

మన్యంలో తాగునీటి సమస్యకు దర్పణం ఈ చిత్రం. హుకుంపేట మండలం రంగశీల జంక్షన్ గ్రామానికి చెందిన ఈ చిన్నారి సమీప కొండ ప్రాంతంలోని ఊట నీటిని ఏడు దొంతుల సిల్వర్ పాత్రల్లో సేకరించి ఇంటికి తీసుకువెళ్తూ ఇలా కనిపించింది. జలజీవన్ మిషన్ పథకాలు మారుమూల గ్రామాలకు విస్తరించనందున తాగునీటి సమస్య కొనసాగుతోంది. – సాక్షి, పాడేరు

న్యూస్‌రీల్

ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు సత్కారం



ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును సన్మానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన పాడేరు ఎమ్మెల్యే, మోదకొండమ్మతల్లి ఆలయ కమిటీ చైర్మన్ మత్స్యరాస విశ్వేశ్వరరాజును ఆదివారం ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది. అమ్మ వారిని దర్శించుకున్న ఆయన ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యం, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు చల్లా రామకృష్ణ, బోనంగి వెంకట రమణ, గబులంగి శంకరరావు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కలుషిత ఆహార బాధితులకు సాయం పంపిణీ



విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : అనకాపల్లి జిల్లాలో ఓ మిషనరీ వసతి గృహంలో ఈనెల 17న చోటు చేసుకున్న కలుషిత ఆహార ఘటనలో మరో ఆరుగురు విద్యార్థులకు ఆదివారం చెక్కులను అందజేశారు. విశాఖ కేజీహెచ్‌లో వైద్యం పొందిన ఆరుగురు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో వారిని స్థానిక జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. దీంతో జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్ జిల్లా ఆస్పత్రికి చేరుకొని వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం ఒకొక్కరికి రూ.50 వేల చెక్కులతో పాటు 25 కిలోల బియ్యం, పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఇకపై విద్యార్థులను ప్రభుత్వ వసతి గృహాల్లోనే చేర్చాలని టీడబ్ల్యూ డీడీ కొండలరావును ఆదేశించారు. డిశ్చార్జి అయిన ఆరుగురిని ప్రత్యేక వాహనాల్లో స్వగ్రామాలకు తరలించారు.

అంజోడా సిల్క్‌ఫారంను ఎస్పీ సందర్శన



అంజోడా సిల్క్‌ఫారం వద్ద మొక్కను నాటుతున్న ఎస్పీ అమిత్‌బర్దర్

డుంబ్రిగుడ: మండలంలోని పర్యాటక ప్రాంతం అంజోడా సిల్క్ ఫారంను ఆదివారం ఎస్పీ అమిత్‌బర్దర్ కుటుంబసభ్యులతో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తమ పిల్లలతో కలిసి మొక్కను నాటారు. అటవీశాఖ ఆధ్వర్యంలో దీనిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తుండటం తెలిసిందే.

రాజవొమ్మంగిలో అత్యధిక వర్షపాతం



రాజవొమ్మంగిలో వర్షానికి పొంగిన గెడ్డ

రాజవొమ్మంగి: రంపచోడవరం డివిజన్ పరిధిలో మండలంలో ఆదివారం అత్యధికంగా 47.2 ఎంఎం వర్షపాతం నమోదు అయ్యింది. ఈ విషయాన్ని వాతావరణ శాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. అత్యల్పంగా మారేడుమిల్లిలో 16. 2 ఎంఎం, అలాగే దేవీపట్నంలో 36. 2 ఎంఎం, రంపచోడవరంలో 38.2, వై. రామవరంలో 38.6 ఎంఎం, అడ్డతీగలలో 40. 8 ఎంఎం, గంగవరంలో 42.8 ఎంఎం వర్షపాతం నమోదు అయ్యిందన్నారు.

మహిళా వైద్యులకు రక్షణ తప్పనిసరి



మహిళ వైద్యులకు రక్షణ కరువైంది. నిత్యం ఏదొకచోట మహిళ వైద్యులపై దాడులు, అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రతీ ఆస్పత్రిలో పోలీసు రక్షణ ఉండాలి. ఆస్పత్రికి వస్తున్న రోగులు, వారి బంధువులు వైద్యులు, సిబ్బంది పట్ల గౌరవంగా మెలగాలి. ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పిస్తున్న మహిళా వైద్యులకు ప్రాణ రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. దాడులు జరగకుండా ప్రభుత్వాలు పటిష్టమైన చర్యలు చేపట్టాలి.

– సీహెచ్ కమలకుమారి, వైద్యాధికారిణి, గన్నెల పీహెచ్‌సీ, అరకులోయ మండలం



పోలీసు భద్రత తప్పనిసరి



మహిళా వైద్యులపై జరుగుతున్న దాడులు, హత్యాచార ఘటనల వల్ల భయం గుప్పెట్లో కాలం గడపాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతీ ఆస్పత్రిలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి పోలీస్ శాఖ ప్రత్యేక రక్షణ కల్పించాలి. ఇటువంటి సంఘటనలు జరగకుండా దోషులను ప్రభుత్వాలు కఠినంగా శిక్షించాలి. అందుకు తగ్గట్టుగా ప్రభుత్వాలు చట్టాలను రూపొందించాల్సిన అవసరం ఉంది. విధుల్లో ఉన్న మహిళా వైద్యులకు పోలీసు భద్రత కల్పించాలి.

–శోభారాణి, గైనకాలజిస్ట్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, అరకులోయ

ఫీవర్ ఫియర్

దోమకాటుకు ఆస్పత్రి పాలయ్యా



నా పేరు పాంగి శివరామకృష్ణ. మాది హుకుంపేట మండలం సూకూరు పంచాయతీ నడిం వీధి. మా గ్రామంలో పారిశుధ్యం సమస్య అధికంగా ఉంది. గత కొన్నాళ్లుగా ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. ఫలితంగా దోమలు స్వైర్య విహారం చేస్తున్నాయి. నేను దోమకాటుకు గురై తీవ్ర జ్వరంతో ఈనెల 22న పాడేరు జిల్లా ఆస్పత్రిలో చేరాను. ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించగా మలేరియా నిర్ధారణ అయింది. దీంతో వారం రోజులుగా ఆస్పత్రిలో ఉండి వైద్య చికిత్సలు పొందుతున్నాను. ప్రస్తుతం కోలుకుంటున్నాను. పంచాయతీ అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని శివరామకృష్ణ కోరాడు.

తాగునీరు క్లోరినేషన్‌పై నిర్లక్ష్యం



నా పేరు బాలు. మాది అరకు వ్యాలీ. వారం రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్నా. పాడేరులోని జిల్లా ఆస్పత్రికి వస్తే వైద్యులు రక్త పరీక్షలు నిర్వహించారు. టైఫాయిడ్‌గా నిర్ధారణ అయింది. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు తాగునీటి వనరులు కలుషితం అయ్యాయి. తాగునీటి బావులకు క్లోరినేషన్ చేయడం లేదు. దీనివల్ల కలుషిత నీటిని తాగాల్సి వస్తోంది. అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీని ప్రభావం ప్రజల ఆరోగ్యంపై చూపుతోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుతోపాటు, తాగునీరు క్లోరినేషన్ చేపట్టాలని బాలు పేర్కొన్నాడు.



రోగులతో కిటకిటలాడుతున్న పాడేరులోని జిల్లా సర్వజన ఆస్పత్రిలో వార్డు

జిల్లాలో వ్యాధులు విజృంభిస్తున్నాయి. డెంగ్యూ కేసులు అక్కడక్కడ నమోదు అవుతుండగా మలేరియా ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. గతేడాది 3,711 కేసులు నమోదు కాగా ఈ ఏడాది 8 నెలల వ్యవధిలో 2,287 మంది మలేరియా బారిన పడ్డారు. గ్రామాల్లో పారిశుధ్యం, దోమల నివారణ మందు పిచికారీపై ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడం వల్ల దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. మలేరియా కేసులు నమోదవుతున్న గ్రామాల్లో చేపట్టాల్సిన మూడవ విడత దోమల నివారణ మందు పిచికారీ ఇప్పటికీ ప్రారంభించకపోయినా ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- పెరుగుతున్న మలేరియా కేసులు
- గ్రామాల్లో అధ్వానంగా పారిశుధ్యం
- ప్రారంభం కాని మూడవ విడత దోమల నివారణ మందు పిచికారీ
- వ్యాధులు విజృంభిస్తున్నా సర్కారు మొద్దునిద్ర
- రోగులతో కిటకిటలాడుతున్న జిల్లా సర్వజన ఆస్పత్రి

సాక్షి గ్రాండ్ రిపోర్ట్



ఆస్పత్రి ల్యాబ్ వద్ద రక్త పరీక్షల కోసం వేచి ఉన్న రోగులు

పాడేరు: జిల్లాలో వ్యాధులు పంజా విసురుతుండటంతో ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. జిల్లా ఆస్పత్రికి కొద్దిరోజులుగా రోగుల తాకిడి నెలకొంది. రోజుకు సుమారు 350–400 మంది రోగులు వస్తున్నారు. వీరిలో జ్వరపీడితులు ఎక్కువ మందే ఉంటున్నారు. రక్త పరీక్షలు నిర్వహించిన తర్వాత సుమారు 10 మందికి పైగా మలేరియా, టైఫాయిడ్ జ్వర పీడితులు ఇన్‌పేషెంట్‌గా చేరి వైద్యసేవలు పొందుతున్నారు.

- పాడేరులోని జిల్లా సర్వజన ఆస్పత్రికి శనివారం 496 మంది ఓపీకి వచ్చారు. వీరిలో 63 మంది వైరల్ జ్వరాలు, 13 మందికి డెంగ్యూ, 21 మందికి మలేరియా రక్తపరీక్షలు నిర్వహించారు. ఆదివారం ఓపీకి 125 మంది వచ్చారు. వీరిలో 26 మందికి వైరల్ జ్వరాలు, 10 మందికి డెంగ్యూ, 23 మందికి మలేరియా పరీక్షల నిమిత్తం నమూనాలు సేకరించారు. ఆస్పత్రిలో 420 పడకలు ఉండగా వివిధ వ్యాధులతో బాధపడుతున్న 336 మంది ఇన్ పేషెంట్లుగా వైద్యసేవలు పొందుతున్నారు.
- అరకువ్యాలీ, రంపచోడవరం ఏరియా ఆస్పత్రుల్లో ప్రతి రోజు ఓపీకి 100 నుంచి150 మంది వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారు వస్తున్నారు. వీటి పరిధిలో కూడా రోజుకు మూడు నుంచి ఐదు మలేరియా కేసులు నమోదు అవుతున్నాయి.
- చింతపల్లి, ముంచంగిపుట్టు సామాజిక ఆస్పత్రుల్లో ప్రతి రోజు ఓపీ సమయంలో సుమారు 100 మంది వైద్య సేవలు పొందుతున్నారు. ఇక్కడ కూడా ఒకటి, రెండు మలేరియా కేసులు నమోదవుతున్నాయి.
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లలో రోజుకు సుమారుగా 50 మంది రోగులు ఓపీకి వస్తున్నారు. వీరిలో కూడా జ్వరపీడితులు ఉంటున్నారు.

అక్కడక్కడ డెంగ్యూ..

జిల్లాలోని 22 మండలాల్లో డెంగ్యూ కేసులు నమోదు అవుతున్నాయి. ప్రభుత్వాస్పత్రుల్లో గత ఏడాది 2023 జనవరి నుంచి ఆగస్టు 18 వరకు 1866 మంది జ్వర పీడితులకు రక్తపూతలు సేకరించారు. వీరిలో 107 మందికి డెంగ్యూ నిర్ధారణ అయింది. ఈ ఏడాది కూడా కేసులు తగ్గుముఖం పట్టడం లేదు. జనవరి నుంచి ఇప్పటివరకు 3,396 మందికి రక్త పూతలు సేకరించగా వీరిలో 23 మందికి డెంగ్యూ నిర్ధారణ అయింది. ప్రస్తుతం రోజురోజుకు జ్వరపీడితుల సంఖ్య పెరుగుతున్నందున డెంగ్యూ కేసులు నమోదు అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పెరుగుతున్న మలేరియా ప్రభావం

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో గత ఏడాది 12 నెలల వ్యవధిలో 8,08,938 మందికి రక్తపూతలు సేకరించగా వీరిలో 407మందికి మలేరియా పీవీ, 3,304 మందికి మలేరియా పీఎఫ్ కేసులు నమోదయ్యాయి. మొత్తం మీద 3,711 మలేరియా కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు 18 వరకు జిల్లా వ్యాప్తంగా 5,38,868 మందికి రక్త పూతలు సేకరించగా 312 మంది మలేరియా పీవీ, మరో 1975 మందికి మలేరియా పీఎఫ్ కేసులు నమోదయ్యాయి. మొత్తం మీద ఇప్పటి వరకు 2287 మలేరియా కేసులు నమోదైనట్టు అధికార వర్గాలు తెలిపాయి.

క్షీణించిన పారిశుధ్యం

జిల్లా కేంద్రం పాడేరులో పారిశుధ్య సమస్య నెలకొంది. మెయిన్‌రోడ్, సినిమాహాల్ సెంటర్, పాతబస్టాండ్ ప్రాంతాల్లో మురుగుకాల్వల వ్యవస్థ పాతది కావడంతో మురుగునీరు సాఫీగా పోయే పరిస్థితి లేదు. అలాగే వీధులలోను ఆదే పరిస్థితి. పట్టణంలో చెత్తచెదారంను తొలగిస్తున్నప్పటికి పంచాయతీ పరిధిలోని శివారు గ్రామాలైన పాత పాడేరు,కొత్త పాడేరు, పాడేరు గొందూరు, సుండ్రుపుట్టు గ్రామాల్లో మాత్రం చెత్తచెదారం పేరుకుపోతున్నాయి. పాడేరు పట్టణమంతా దోమల బెడద అధికంగా ఉంది. ప్రజలు తరచూ జ్వరాలు, వ్యాధుల బారిన పడుతున్నారు.

పిచికారీపై నిర్లక్ష్యం

జిల్లా వ్యాప్తంగా అధికారులు గుర్తించిన మలేరియా ప్రభావిత గ్రామాల్లో పూర్తిస్థాయిలో దోమల నివారణ మందు పిచికారీ జరగలేదు. మొత్తం 1767 మలేరియా ప్రభావిత గ్రామాలను అధికారులు గుర్తించారు. వీటిలో పాడేరు డివిజన్‌లో 1200, రంపచోడవరం, చింతూరు డివిజన్‌లో 468 గ్రామాలు ఉన్నాయి. మొదటి విడత పిచికారీ ఈ ఏడాది ఏప్రిల్ 15 నుంచి ప్రారంభం కాగా జూన్ 23 నాటికి 1762 గ్రామాల్లో చేశారు. మరో ఐదు గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ జరగలేదు.

- రెండో విడత పిచికారీ జూలై ఒకటి నుంచి ఆగస్టు 18 వరకు 1309 గ్రామాల్లో మాత్రమే చేపట్టారు.
- మూడవ విడత దోమల నివారణ మందు పిచికారీ పిచికారీ మొదలుపెట్టలేదు. మలేరియా, డెంగ్యూ కేసులు నమోదైన గ్రామాల్లో పిచికారీ చేయాల్సి ఉంది. అలాంటిది జిల్లాలో ఒకపక్క జ్వరాల తీవ్రత పెరుగుతున్నా సంబంధిత గ్రామాల్లో ఇప్పటివరకు దోమల నివారణ మందు పిచికారీ మొదలు పెట్టలేదు. జ్వరాల తీవ్రత పెరుగుతున్నా అధికారుల్లో చలనం లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

జ్వరాల వివరాలు

రక్తపూతలు సేకరణ	నిర్ధారణ
డెంగ్యూ	
3,396	23
మలేరియా	
5,38,868	2,287

జిల్లా సమాచారం

పీహెచ్‌సీలు :	64
ఏరియా ఆస్పత్రులు :	3
సీహెచ్‌సీలు :	6
జిల్లా సర్వజన ఆస్పత్రి:	ఒకటి (పాడేరు)



పాడేరు జిల్లా ఆస్పత్రిలో ఓపీ సమయంలో రోగుల రద్దీ



పాడేరు మండలం చింతలవీధి ప్రధాన రహదారి పక్కన పేరుకుపోయిన చెత్త

సిబ్బందిని అప్రమత్తం చేశాం



జిల్లా వ్యాప్తంగా ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నాం. వైద్యసిబ్బందిని అప్రమత్తం చేశాం. గ్రామాల్లో వైద్యసిబ్బంది ఇంటింటి తిరిగి అనారోగ్యానికి గురైన వారిని గుర్తిస్తున్నారు. జ్వర లక్షణాలు ఉంటే వారికి రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. జ్వరాల ప్రభావం ఎక్కువగా ఉన్నప్పటికీ అదేస్థాయిలో వైద్యసేవలు విస్తృతం చేశాం.

– జమాల్‌బాషా, డీఎంహెచ్‌వో, పాడేరు

మంచంపట్టిన తాటిబంద

వైద్యశిబిరం ఏర్పాటుచేయాలని కలెక్టర్‌కు లేఖ



జ్వరంతో మంచానికి పరిమితమైన వృద్ధురాలు

చింతపల్లి: మండలంలోని అంజలిశనివారం పంచాయతీ తాటిబందలో జ్వరాలు విజృంభించాయి. నాలుగురోజులుగా బాధపడుతున్నామని గ్రామానికి చెందిన మర్రి లక్ష్మణ్ తెలిపారు. తక్షణం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని లేఖద్వారా కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కోరినట్టు ఆదివారం తెలిపాడు. గ్రామంలో మర్రి బిందే, సిందరి సీతమ్మ, వంతాల రాజు, వంతాల శలోమి, గెమ్మలి చిన్ని, వంతల దాసు, వంతాల అంజలి, మర్రి అప్పారావు, కుర్ర ఆశులు తదితరులు జ్వరాలతో బాధపడుతున్నారని లక్ష్మణ్ పేర్కొన్నాడు.

శ్రీకృష్ణ జన్మాష్టమికి ఏర్పాట్లు

- తాజంగిలో నేడు వేడుకలు
- కోలాటం, థింసా పోటీల నిర్వహణ

చింతపల్లి: తాజంగిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ గ్రామంలో ఏటా అత్యంత వైభవంగా నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ముంచంగిపుట్టు మండలం నుంచి ఈ ప్రాంతానికి వలస వచ్చిన ఒడియా భగత కుటుంబీకులు ఏటా వీటిని నిర్వహిస్తున్నారు. ఈఏడాది కూడా అత్యంత వైభవంగా నిర్వహించేందుకు రాధా కృష్ణుల ఆలయాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. సోమవారం ఉత్సవం సందర్భంగా కోలాటం, థింసా పోటీలు నిర్వహిస్తున్నట్టు స్థానికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ, హైదరాబాద్‌కు చెందిన వారితో వైద్య శిబిరం, అన్నసమారాధన ఏర్పాటుచేసినట్టు ఆలయ ప్రతినిధులు సీసా నీలకంఠం మాస్టారు, సీసా దేవదాసులు తెలిపారు.



వేడుకలు సిద్ధమైన రాధాకృష్ణ ఆలయం



తాజంగిలో ఉట్టి కట్టేందుకు సిద్ధం చేసిన రాటలు

పోటెత్తిన పర్యాటకులు



చెరువులవేనంలో పర్యాటకుల సందడి

చింతపల్లి: ఆంధ్ర ఊటీగా పేరుపొందిన లంబసింగిలో ఆదివారం పర్యాటకుల సందడి కనిపించింది. వాతావరణంలోని మార్పులతో నెలకొన్న మంచు అందాలను తిలకించారు. చెరువులవేనంకు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

డుంబ్రిగుడ: పర్యాటకేంద్రం చాపరాయి జలపాతం ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. జలపాతంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు. బాంబూ చికెన్, చీకుల అమ్మకాలు భారీగా జరిగాయి.

జి.మాడుగుల: మండలంలో కొత్తపల్లి జలపాతానికి ఆదివారం పర్యాటకుల తాకిడి నెలకొంది. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో దూరప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. దీంతో జలపాతం పరిసరాల్లో సందడి నెలకొందని సూపర్‌వైజర్ వంతాల అభి తెలిపారు.



చాపరాయి ముఖద్వారం వద్ద పర్యటకులు

పాడేరు ఐటీడీఏ పీవోగా అభిషేక్ కొనసాగింపు

- పాడేరు సబ్ కలెక్టర్‌గా సూర్యమాన్ పటేల్
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ఉత్తర్వుల జారీ



అభిషేక్



సూర్యమాన్ పటేల్

పాడేరు : పాడేరు ఐటీడీఏ పీవో వి. అభిషేక్‌ను కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 17న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్‌ను బదిలీ చేస్తూ అయన స్థానంలో ఐటీడీఏ పీవోగా, ఇంచార్జీ సబ్ కలెక్టర్‌గా ప్రఖర్ జైన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వ్‌ల జారీ చేయడం తెలిసిందే. వీరి బదిలీలు ప్రస్తుతం నిలిచిపోయాయి. పాడేరు ఐటీడీఏ పీవోగా వి. అభిషేక్‌ను కొనసాగిస్తూ గతంలో ఇక్కడికి బదిలీ చేసిన ప్రఖర్ జైన్‌ను బాపట్ల జాయింట్ కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ఇక పాడేరు సబ్ కలెక్టర్‌గా 2022 బ్యాచ్ ఐఏఎస్ అధికారి సూర్యమాన్ పటేల్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

రేపటి నుంచి స్వీయ మూల్యాంకన పరీక్షలు

- అన్ని యాజమాన్య పాఠశాలల్లో నిర్వహణ
- జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు

సాక్షి,పాడేరు: ఈనెల 27వతేదీ నుంచి వచ్చేనెల 4వతేదీ వరకు అన్ని యాజమాన్య పాఠశాలల్లో సెల్ఫ్ ఎసెస్‌మెంట్ (స్వీయ మూల్యాంకనం) మోడల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని డీఈవో పి.బ్రహ్మాజీరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒకటి నుంచి 8వతరగతి వరకు విద్యార్థులంతా ఓఎంఆర్ పైనే పరీక్షలు రాయాలని, 9,10 తరగతుల విద్యార్థులు మాత్రం పాత విధానంలో పరీక్షలు రాయాల్సి ఉంటుందన్నారు. ఎస్సీఈఆర్టీ రూపొందించిన ప్రశ్నపత్రాల ఆధారంగానే పరీక్షలు జరుగుతాయన్నారు. ఎంఈవోల పర్యవేక్షణలో వీటిని పరీక్ష సమయానికి గంట ముందు పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేస్తారని తెలిపారు.

పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు టైంటేబుల్ ప్రకారమే పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈనెల 27న ఓఎస్ఎస్‌సీ, 28న తెలుగు, 30న ఆంగ్లం, 31న గణితం, సెప్టెంబర్ 2న ఎన్విరాన్‌మెంట్ సైన్స్, 3న జనరల్ సైన్స్, 4న సోషల్ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సీనియర్ హెచ్‌ఎంలు, ఎంఈవో–1, ఎంఈవో–2లో కమిటీలు ఏర్పాటు చేశామని చెప్పారు.



ప్రాణాలు రక్షించడమే ధ్యేయం

రోగుల ప్రాణాలు రక్షించేందుకు వైద్యులు రాత్రి, పగలు ఎంతో శ్రమిస్తున్నాం. ఎంతో కష్టపడి వైద్యం అందిస్తున్నా మాపై రానురాను దాడులు పెరిగి పోతున్నాయి. ఆస్పత్రుల్లో రోగికి సక్రమంగా సేవలందించే పనుల్లో ఉండగా రోగి సంబంధీకులు, సహాయకులు వచ్చి ఆటంకం కలిగించడం, కొంతమంది మద్యం సేవించి వచ్చి దాడులు, గొడవలు చేస్తున్నారు. ఆస్పత్రుల వద్ద సెక్యూరిటీని ఏర్పాటుచేసి ఇలాంటివి నియంత్రించాలి. మహిళా పోలీసులు అందుబాటులో ఉండేలా చూడాలి.

– కైలాస్ స్పందన, సివిల్ అసిస్టెంట్ సర్జన్, చింతూరు ఏరియా ఆస్పత్రి



నిఘా పెంచాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిఘా వ్యవస్థ పెంపొందించాలి. నిఘా ఉంటే అరాచకాలకు పాల్పడే వ్యక్తుల సంఖ్య గణనీయంగా తగ్గుతుంది. ఆస్పత్రుల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండ చూడాలి. ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద చెక్ పాయింట్లు ఏర్పాటు చేయాలి. లోపలికి వెళ్లేందుకు అనుమతులపై కఠిన ఆంక్షలు విధించాలి. పోలీసు అవుట్‌పోస్టు ఉండేలా చూడాలి. వైద్యులు, సిబ్బందిపై దాడులకు పాల్పడకుండా కఠిన చట్టాలు అమల్లోకి తీసుకురావాలి.

– డాక్టర్ రాహుల్, సూపరింటెండెంటు, సీహెచ్‌సీ, వై.రామవరం

క్లుప్తంగా

మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం



చెక్కులు అందజేస్తున్న ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం : మహిళా సంఘాలు ఆర్థిక అభివృద్ధి చెందే విధంగా పీఎం మోదీ లక్‌పతి దీదీ పథకం ప్రవేశపెట్టినట్టు రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం పేర్కొన్నారు. మహిళా సంఘాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రకాలైన పథకాల ద్వారా అభివృద్ధి చెందే విధంగా లక్‌పతి దీదీ పథకం పీఎంలో లైవ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పీవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో సింహాచలం మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వెనుకబడిన మహిళలను లక్షాధికారిని అయ్యే విధంగా కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ ద్వారా ప్రతీ గ్రామంలో ఆర్థికంగా వెనుకబడి మహిళలను గుర్తించడం జరుగుతుందన్నారు. మొత్తం 32,200 మంది టార్గెట్‌కు 24,573 మంది మహిళలను ముందుగా గుర్తించినట్టు చెప్పారు. రెండు సంవత్సరాలు దాటిన స్వయం సహాయ సంఘాలలో నిరుపేద మహిళలను గుర్తించి సుస్థిరమైన జీవనోపాధులు కల్పించనున్నట్టు తెలిపారు.మహిళ సంఘాలకు బ్యాంకు లింకేజ్ ద్వారా చెక్‌లను పీవో అందజేశారు. వైస్ ఎంపీపీ పండా కుమారి, ఎంపీటీసీ సభ్యురాలు ఉలవల లక్ష్మి, ఏపీడీ శ్రీనివాసరావు, డీపీఎం అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

27న బార్క్ డైరెక్టర్ రాక

మహారాణిపేట(విశాఖ) : బాబా ఆటోమెటిక్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ వివేక్ భాసిన్ ఈనెల 27న విశాఖ వస్తున్నారు. ముంబై నుంచి మంగళవారం 3.15 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి నరసింహనగర్‌లో ఉన్న బార్క్‌కు చేరుకొని అక్కడ బస చేస్తారు. 28న అచ్యుతాపురం వెళ్తారు. 29న మధ్యాహ్నం 2.30 గంటలకు విమానంలో హైదరాబాద్ వెళ్తారు.

ఇదేమి సర్దుబాటు!

- సర్‌ప్లస్ పేరుతో అసంబద్ధ బదిలీలు
- ఉపాధ్యాయుల్లో తీవ్ర వ్యతిరేకత
- విశాఖ జిల్లాలో 409 మంది మిగులు ఉపాధ్యాయులు
- విద్యా సంవత్సరం మధ్యలో ఎక్కడికి వెళ్లాలని ఆవేదన
- గళం విప్పకుండా ఉపాధ్యాయ సంఘాలపై ఒత్తిళ్లు
- ఎంటీఎస్ టీచర్లకూ తప్పని సర్దుపోటు



జీవీఎంసీ గాంధీ విగ్రహం నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు (ఫైల్)

విశాఖ విద్య : ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ ముందుకు సాగడంలేదు. తాము అధికారంలోకి వస్తే ఉపాధ్యాయులకు అనుకూలంగా ఉంటామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఆదిలోనే మాట తప్పింది. ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలతో ఉపాధ్యాయుల 'సర్దుబాటు ప్రక్రియ ఒక అడుగు ముందుకి నాలుగు అడుగులు వెనక్కి' అన్న చందాన సాగుతుంది. ఫలితంగా స్కూళ్లలో పాఠ్యాంశాల బోధన సవ్యంగా సాగక విద్యార్థులు చదువుల్లో వెనుకబడిపోతున్నారు.

అంతా గందరగోళం

ఉపాధ్యాయుల సర్దుబాటు అనేది ఏటా జరిగేదే. ఆయా పాఠశాల అవసరాల మేరకు మండల స్థాయిలో ఎంఈవో ఈ ప్రక్రియను పూర్తి చేస్తుంటారు. కానీ కూటమి ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు ఉపాధ్యాయులకు చేటు తెచ్చిపెట్టాయి. ఉపాధ్యాయుల సర్దుబాటుపై జారీ చేసిన ఉత్తర్వులను రెండు సార్లు మార్చినప్పటికీ ఉపాధ్యాయులు నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతూనే ఉంది. సర్‌ప్లస్ పేరిట సిద్ధం చేసిన జాబితాలపై కూడా ఉపాధ్యాయులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. మినిమమ్ టైం స్కేల్(ఎంటీఎస్)తో పనిచేస్తున్న వారిని సైతం మిగులు ఉపాధ్యాయుల జాబితాలో చేర్చి, బదిలీలకు సిద్ధమవుతుండటంతో వారిలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

మిగులు ఉపాధ్యాయుల్లో గుబులు

జిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూల్ అసిస్టెంట్లు అన్ని క్యాడర్లు కలుపుకొని 409 మంది ఉపాధ్యాయులు సర్‌ప్లస్‌గా ఉన్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు లెక్క తేల్చారు. తొలుత మండల స్థాయిలో సర్దుబాటు చేసి, ఇంకా మిగులు ఉపాధ్యాయులు ఉన్నట్లయితే, వారిని డివిజన్‌లోని ఇతర మండలాల్లో గల పాఠశాలలకు పంపిస్తారు. ఇదే మిగులు ఉపాధ్యాయులకు ఆందోళన రేకెత్తిస్తుంది. ఉదాహరణకు చినగదిలి మండలంలో 81 మంది మిగులు ఉపాధ్యాయులు ఉండగా, అక్కడ 13 మందే సర్దుబాటుకు అవకాశం ఉంది. మిగిలిన 68 మంది ఉపాధ్యాయులు భీమిలి డివిజన్‌లోని ఏ మండలానికైనా వెళ్లాల్సి ఉంటుంది. నగరంలో పనిచేస్తున్న తమను ఇలా అర్థాంతరంగా ఎక్కడికి పంపిస్తారో తెలియక ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది.

కుంటుపడుతున్న చదువులు

జిల్లాలోని గోపాలపట్నం మండలం బుచ్చిరాజుపాలెం యూపీఎస్‌లో 340 మంది విద్యార్థులు ఉన్నారు. సెకండరీ గ్రేడ్ టీచర్లు ఏడుగురు, స్కూల్ అసిస్టెంట్లు నలుగురు పనిచేస్తున్నారు. ప్రాథమిక తరగతుల్లోని విద్యార్థుల సంఖ్యను పరిగణలోకి తీసుకొని ఇక్కడ నలుగురు ఎస్జీటీలు సర్‌ప్లస్‌గా ఉన్నట్లు విద్యాశాఖాధికారులు ప్రకటించారు. కానీ ఇప్పటికే ఇక్కడ ఫిజికల్ సైన్సు, బయాలజీ, హిందీ సబ్జెక్టులను బోధించే ఉపాధ్యాయులు లేరు. జిల్లాలోని చాలా స్కూళ్లలో ఇదే పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం సాగదీత ధోరణితో అవసరమైన చోట కూడా ఉపాధ్యాయులు లేక, స్కూళ్లలో చదువులు కుంటుపడుతున్నాయి.

ఉపాధ్యాయ సంఘాలపై ఒత్తిళ్లు

సర్దుబాటు ప్రక్రియలో ప్రభుత్వం తీసుకుంటున్న అసంబద్ధ నిర్ణయాలపై ఉపాధ్యాయుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో సంఘాల నాయకులు తమ గళం వినిపించక తప్పటం లేదు. ఈ నేపథ్యంలోనే కొంతమంది ఉపాధ్యాయులు రోడ్డు ఎక్కారు. జీవీఎంసీ ఎదురుగా గల గాంధీ విగ్రహం ముందు ప్లకార్డులతో నిరసన తెలిపారు. మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ ఆందోళనకు సైతం పిలుపునిచ్చింది. అయితే సంఘాల నాయకులకు పై స్థాయి నుంచి బెదిరింపులు వస్తున్నట్లు తెలుస్తోంది. ఉపాధ్యాయుల సమస్యలపై గళమెత్తాల్సిన సంఘాల నాయకులు ఇలాంటి పరిణామాలతో వెనక్కి తగ్గుతున్నారు. ఫలితంగా ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం కలుగుతుంది.

మండలాల వారీగా ఇదీ పరిస్థితి

మండలం	మిగులు ఉపాధ్యాయులు	అవసరం ఉన్నది
ఆనందపురం	32	10
భీమునిపట్నం	45	45
చినగదిలి	81	13
గాజువాక	33	6
గోపాలపట్నం	43	23
ములగాడ	15	4
పద్మనాభం	24	6
పెదగంట్యాడ	21	6
పెందుర్తి	65	16
సీతమ్మధార	28	23
మహారాణిపేట	22	33
	409	185

ప్రాథమిక విద్యకు విఘాతం



పని సర్దుబాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ఇప్పటికే ఫ్యాఫ్టో పక్షాన దీన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించాం. పాఠశాలల్లో సమస్యలపై దిద్దుబాటు లేకుండా సర్దుబాటు చేయటం వల్ల ప్రాథమిక విద్యకు తీవ్ర విఘాతం కలుగుతుంది. డీఎస్సీ ఆలస్యమవుతున్నందున హైస్కూళ్లలో బోధనకు ఆటంకం లేకుండా తాత్కాలికంగా అకడమిక్ ఇనస్ట్రక్టర్లను నియమించాలి. దీనివల్ల ఉపాధ్యాయ శిక్షణ పొందిన నిరుద్యోగులకు మేలు జరుగుతుంది.

– టి.ఆర్.అంబేద్కర్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి


పదోన్నతులు ఇవ్వాలి



జీవో నెంబర్ 117ను రద్దు చేయాలి. ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ల కొరత ఉన్నందున, గతంలో మాదిరే అర్హత గల ఎస్జీటీలకు నెలవారీ పదోన్నతులు కల్పించాలి. ఆ ఖాళీలను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలి. ఏ మేనేజ్‌మెంట్‌కు చెందిన ఉపాధ్యాయులను అదే మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో సర్దుబాటు చేయాలి. అంతవరకు సర్దుబాటు ప్రక్రియను నిలిపివేయాలి.

– కె.శ్రీనివాస్, ఏపీటీఎఫ్, రాష్ట్ర కార్యదర్శి

ఆస్పత్రిలో కింగ్‌కోబ్రా కలకలం



మోతుగూడెం జెన్‌కో ఆస్పత్రిలో ప్రవేశించిన కింగ్‌కోబ్రా

మోతుగూడెం: మోతుగూడెం ఏపీ జెన్‌కో ఆస్పత్రి ఓపీ రూమ్‌లోకి సుమారు 12 అడుగుల కింగ్‌కోబ్రా ప్రవేశించి హల్‌చల్ చేసింది. దీంతో ఆస్పత్రి సిబ్బంది భయాందోళనకు గురైయ్యారు. ఆస్పత్రి సిబ్బంది వెంటనే పాము దూరిన గదికి తాళం వేశారు. అటవీ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్టు సిబ్బంది వచ్చి కింగ్‌కోబ్రాను పట్టుకొని సమీప అడవిలో వదిలేశారు.

ఆర్మీ ర్యాలీకి వేళాయె



క్యూలో నిల్చున్న అభ్యర్థులు

సాక్షి, విశాఖపట్నం : అగ్నివీర్ నియామక ప్రక్రియలో భాగంగా సోమవారం నుంచి పోర్టు స్టేడియంలో భారీ ఆర్మీ ర్యాలీ ప్రారంభం కానుంది. సెప్టెంబర్ 5 వరకూ ఈ నియామక ప్రక్రియకు సంబంధించిన వివిధ రకాల పరీక్షలు నిర్వహించనున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా, తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ, ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన అభ్యర్థులు ఆదివారం రాత్రి నుంచి పోర్టు స్టేడియం వద్దకు చేరుకున్నారు.

నదిలో పడి విద్యార్థి మృతి

నర్సీపట్నం: స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన ఎం.తారక్(14) అనే విద్యార్థి ప్రమాదవశాత్తు కాలుజారి నదిలో పడి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలో ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న తారక్ ఆదివారం సెలవు దినం కావడంతో స్నేహితులతో కలిసి బలిఘట్టం ఉత్తరవాహిని నదీ తీరంలో అన్న సంతర్పణ కార్యక్రమానికి వెళ్లాడు. భోజనం అనంతరం నదీ తీరానికి వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు కాలు జారి నదిలో పడిపోయాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు నది వద్దకు చేరుకుని స్థానికుల సాయంతో గాలించగా విద్యార్థి మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యులు, బంధువులు నది వద్దకు చేరుకుని తారక్ మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. పోస్టుమార్టానికి మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టౌన్ పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో బాలుడి మృతి



చికిత్స పొందుతూ మృతి చెందిన దీపేష్

అక్కిరెడ్డిపాలెం (విశాఖ): మేడపై జీఏ వైరుతో ఆడుకుంటున్న బాలుడు విద్యుత్ షాక్‌కు గురై.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. గాజువాకలోని ఆర్‌హెచ్ కాలనీలో ఈ ఘటన చోటు చేసుకుంది. గాజువాక సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివీ.. విజయనగరం జిల్లా గుర్ల మండలం గవిడిపేటకు చెందిన గవిడి త్రినాథరావు, భార్య, ఇద్దరు పిల్లలు గవిడి దీక్షిత్, దీపేష్(9)తో గాజువాక శ్రీనగర్ దిబ్బపాలెం, ఆర్‌హెచ్‌కాలనీలో నివాసం ఉంటున్నారు. 20 ఏళ్ల నుంచి స్టీల్‌ప్లాంట్‌లో ఎల్ఎంఎంఎం క్యాంటీన్‌లో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. కాగా.. ఆదివారం అతని చిన్న కుమారుడు దీపేష్ ఇంటి మేడపై జీఏ వైర్‌తో ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో హై టెన్షన్ వైరుకు జీఏ వైరు తగిలి విద్యుత్ షాక్‌కు గురై పడిపోయాడు. ఇది గమనించిన దీపేష్ బంధువు.. గట్టిగా కేకలు వేశాడు. వెంటనే దీపేష్‌ను అతని తండ్రి దగ్గరలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. త్రినాథరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

అంకుడు కర్రపై 'చిన్ని కృష్ణుడు'

ఏటికొప్పాక కళాకారిణి నైపుణ్యం



అంకుడు కర్రతో లావణ్య చేతిలో రూపుదిద్దుకున్న సూక్ష్మ గోపాలుడు

యలమంచిలి రూరల్: మండలంలోని ఏటికొప్పాక పేరు చెప్పగానే ఖండాంతర ఖ్యాతి చెందిన లక్కబొమ్మలు గుర్తుకొస్తాయి. ఎన్నో అసాధ్యాలను సైతం సుసాధ్యాలు చేయగల కళానైపుణ్యత ఏటికొప్పాక హస్త కళాకారుల సొంతమని చెప్పాలి. సందర్భానుసారం ఈ గ్రామానికి చెందిన హస్తకళాకారులు తమ సృజనాత్మకతను చాటుకుంటూ కళాభిమానులను ఆశ్చర్యపరుస్తున్నారు. ఈ గ్రామానికి చెందిన హస్త కళాకార్మికురాలు (కళాకారిణి) చింతల లావణ్య శ్రీ కృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని ఒక చిన్న అంకుడు కర్ర ముక్కపై అతి సూక్ష్మమైన గోపాలుడి రూపాన్ని అద్భుతంగా తయారు చేశారు. 3.5 సెంటీమీటర్ల పొడవు, 2 సెంటీమీటర్ల వెడల్పున గోపాలుడి వేషధారణలో ఉన్న కృష్ణుడిని, ఆ వెనుక గోమాతను అద్భుతంగా చెక్కి ఔరా అనిపించారు. దీనిని తయారు చేయడానికి తనకు రెండు రోజులు సమయం పట్టిందని లావణ్య చెప్పారు. ఇటీవల వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని ఆమె గోటిపై పట్టేంత అతి చిన్న సైజులో లక్ష్మీదేవి బొమ్మను అంకుడు కర్రతో తయారుచేశారు.

విశాఖలో ప్రమాదం.. కశింకోట వాసి మృతి

పీఎం పాలెం (విశాఖ): గుర్తు తెలియని ఓ ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంగా ఆటో నడిపి ఒక వ్యక్తి మృతికి కారకుడయ్యాడు. ఈ ఘటనకు సంబంధించి విశాఖపట్నం పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలివి. అనకాపల్లి జిల్లా కశింకోటకు చెందిన పగడాల రమణ(50) అనే వ్యక్తి విశాఖ నగరంలోని పెట్రోల్ బంకుల వద్ద జరిగే పనుల్లో కూలీగా చేస్తుంటాడు. ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5.30 గంటల సమయంలో సహచర కూలీ దాస్‌తో కలిసి కొమ్మాది నుంచి కార్‌షెడ్ కూడలికి వచ్చే ఆటో ఎక్కాడు. డ్రైవర్ నిర్లక్ష్యంగా ఆటో నడపడంతో పగడాల రమణ కిందకు పడిపోయాడు. తలకు తీవ్రమైన గాయం కావడంతో అధికంగా రక్తస్రావం జరిగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఆటో డ్రైవర్ క్షతగాత్రుడిని కనీసం పట్టించుకోకుండా సంఘటన స్థలం నుంచి పరారయ్యాడు. రమణను వెంటనే వైద్యం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న మృతుడి కుమార్తె నీలిమ శనివారం రాత్రి పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రామకృష్ణ తెలిపారు.

వేతన బకాయిల చెల్లింపునకు ఏర్పాట్లు

కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో చొరవతో పరిష్కారం కానున్న సమస్య

సాక్షి,పాడేరు: స్థానిక జిల్లా సర్వజన ఆస్పత్రిలో గత ఐదు ఆరు నెలల నుంచి వేతనాలు లేకుండా ఇబ్బందులు పడుతున్న వైద్యసిబ్బంది సమస్య పరిష్కారానికి కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్ చర్యలు తీసుకున్నారు. బకాయి వేతనాలు చెల్లించేందుకు ఖజానా శాఖ అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదే ఆస్పత్రిలో పనిచేస్తున్న స్టాఫ్ నర్స్ మీరాభాను వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఆత్మహత్యకు యత్నించడం తెలిసిందే. ఈనేపథ్యంలో ఇదే ఆస్పత్రిలోని అవుట్‌సోర్సింగ్ వైద్యసిబ్బంది శనివారం విధులకు దూరమై ధర్నా చేపట్టారు. సమస్య పరిష్కరించకుంటే వచ్చే నెల ఏడవ తేదీనుంచి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. దీనిపై కలెక్టర్, పాడేరు ఐటీడీఏ పీవో స్పందించారు. వైద్య విద్య రాష్ట్ర సంచాలకులు, ఖజానా శాఖ రాష్ట్ర సంచాలకులు, ఇతర ఉన్నతాధికారులతో వారు చర్చించారు. వేతనాల చెల్లింపులకు సంబంధించి వారు ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న ఏడుగురు రెగ్యులర్ సిబ్బందితో పాటు, 49 మంది కాంట్రాక్ట్ సిబ్బందికి సంబంధించి జిల్లా ఖజానా కార్యాలయానికి సమర్పించి ఐదు నెలల వేతన బిల్లులను ఆమోదించారు. మొత్తం 56 మంది వేతన బకాయిలు ఒకటో తేదీన వారి ఖాతాల్లో జమ అవుతాయని జిల్లా ట్రెజరీ అధికారి ప్రసాదబాబు తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న మరో 39మంది వైద్యసిబ్బంది జీతాల బిల్లులను కూడా ఆస్పత్రి అధికారులు సమర్పించిన వెంటనే ఆమోదిస్తామని ఆయన పేర్కొన్నారు.

29 నుంచి ఇంటర్ యూనిట్ టెస్టు పరీక్షలు

విశాఖ విద్య: జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని జూనియర్ కాలేజీల్లో ఈ నెల 29 నుంచి రెండో యూనిట్ టెస్టు పరీక్షలు నిర్వహించాలని డీవీఈవో బి.రాధ తెలిపారు. ఇంటర్మీడియెట్ బోర్డు నుంచి జారీ చేసిన విద్యా అకడమిక్ క్యాలెండర్‌కు అనుగుణంగా పరీక్షల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షలు పూర్తయిన తరువాత వాటిని మూల్యాంకనం చేసి, విద్యార్థులు సాధించిన మార్కులను కాలేజీల వారీగా ఇంటర్మీడియెట్ బోర్డు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

కళల రాజధాని విశాఖ



పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబత్ర బాగ్చీకి పుష్ప కుండీని అందజేస్తున్న నిర్వాహకులు

మద్దిలపాలెం(విశాఖ): సుందరమైన విశాఖ నగరం కళలకు రాజధానిగా, సాహిత్య, సాంస్కృతిక రంగాలకు నిలయంగా భాసిల్లుతోందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబత్ర బాగ్చి అన్నారు. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ 38వ వార్షికోత్సవంలో భాగంగా రెండవ రోజు ఆదివారం కార్యక్రమాన్ని వీఎండీఏ అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.రాజు, కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, ప్రముఖ హిందూస్థానీ సంగీత విద్వాంసురాలు మీతా పండిట్, స్వామి విశ్వేశానంద, హరిప్రియపనందాలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాకారులను ఘనంగా సత్కరించి మాట్లాడారు. సువిశాలమైన విశాఖ నగరం అందానికే కాదు.. మన సంప్రదాయాలకు, సాంస్కృతికి నిలువుటద్దంగా ఉందన్నారు. ఎందరో మహానుభావుల ప్రతిభను ప్రదర్శించిన వేదికగా కళాభారతి ఆడిటోరియం నిలుస్తుందన్నారు. అనంతరం మీతా పండిట్ గాత్ర కచేరీ ప్రేక్షకులను అలరించింది.

సీబీఆర్ఎన్ సెంటర్ ఏర్పాటులో కదలిక

- విశాఖలో వరుస ప్రమాదాల నేపథ్యంలో జోరు పెంచిన కేంద్ర ప్రభుత్వం
- గత ప్రభుత్వంలోనే విమ్స్‌లో స్థలం కేటాయింపు, అనుమతులు మంజూరు
- నెలాఖరున తుది పరిశీలనకు రానున్న కేంద్ర బృందం



స్థలాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం (ఫైల్)

బీచ్‌రోడ్డు: ఉమ్మడి విశాఖ జిల్లాలో వరుసగా అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో విమ్స్‌లో కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్ అండ్ న్యూక్లియర్ (సీబీఆర్ఎన్) మెడికల్ మేనేజ్‌మెంట్ సెంటర్ ఏర్పాటులో కదలిక వచ్చింది. పరిశ్రమల్లో జరిగే అగ్నిప్రమాదాల్లో క్షతగాత్రులకు మెరుగైన వైద్యం ఒకే చోట అందించేందుకు కేంద్ర ప్రభుత్వం గత ఏడాది దేశ వ్యాప్తంగా పది సీబీఆర్ఎన్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు వైద్య సంస్థలను ఎంపిక చేసింది. అందులో తెలుగు రాష్ట్రాల నుంచి విశాఖలోని విమ్స్ ఆసుపత్రి ఒకటి. దీనిపై అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వెంటనే స్పందించి సెంటర్ ఏర్పాటుకు కావలసిన రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించింది. అంతేకాకుండా సెంటర్‌కు అనుమతులను కూడా జారీ చేసింది.

తుది పరిశీలనకు రానున్న కేంద్ర బృందం

అప్పటి ప్రభుత్వం స్థలం కేటాయించడంతోపాటు అన్ని అనుమతులను మంజూరు చేయడంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖ సీనియర్ ప్రాంతీయ సంచాలకులు అనురాధ ఆధ్వర్యంలో విమ్స్‌లో స్థలాన్ని పరిశీలించారు. తుది పరిశీలన కోసం ఈ నెల 28, 29 తేదీల్లో కేంద్ర, రాష్ట్ర నిపుణుల బృందం రానుంది. ఈ పరిశీలన పూర్తయితే సెంటర్ ఏర్పాటుకు మార్గం సుగమమైనట్టే.

కార్పొరేట్ ఆసుపత్రులకు స్వస్తి చెప్పవచ్చు

పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగిన ప్రతీ సారి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కార్పొరేట్ ఆసుపత్రులకు తరలించాల్సి వస్తోంది. జిల్లాలో ఇటీవల పలు పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల్లో క్షతగాత్రులకు నగరంలోని పలు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స అందించారు. అదే సీబీఆర్ఎన్ సెంటర్ ఏర్పాటైతే క్షతగాత్రులందరిని ఒకే సెంటర్‌కు తరలించి మెరుగైన వైద్యం అందించవచ్చు.

ప్రత్యేక వసతులతో మెరుగైన వైద్యం

సీబీఆర్ఎన్ సెంటర్ ఏర్పాటు అనేది పూర్తిగా కేంద్ర ప్రభుత్వానికి సంబంధించినది. రెండు ఎకరాల స్థలంలో రెండు అంతస్తుల్లో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. చికిత్సకు వినియోగించే ప్రత్యేక సామగ్రి, పరికరాలను కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తుంది. ప్రత్యేక శిక్షణ గల నిపుణులను ఇందులో నియమిస్తుంది. ఈ సెంటర్ ఏర్పాటు వల్ల ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందుతుంది.

– డాక్టర్ కె.రాంబాబు, విమ్స్ డైరెక్టర్

క్లుప్తంగా

తెగిపడిన విద్యుత్ వైరు

త్రుటిలో తప్పిన ప్రమాదం



తెగిపడిన విద్యుత్ వైర్‌ను చూపిస్తున్న స్థానికుడు

రాజవొమ్మంగి: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆదివారం ప్రధాన లైన్‌కు చెందిన విద్యుత్ వైరు అకస్మాత్తుగా జాతీయ రహదారిపై తెగి పడింది. అదే సమయంలో ఓ ఆర్టీసీ బస్, పలు ద్విచక్రవాహనాలు ఆ మార్గంలో వేగంగా వస్తున్నాయి. అయినా ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోకపోవడంతో అక్కడ ఉన్న వారంతాఊపిరి పీల్చుకొన్నారు. వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అనంతరం సిబ్బంది విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. కరెంటు తీగలు జీర్ణావస్థకు చేరడంతో తరచు ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి ప్రమాదాల జరగకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

తుమ్మపాల: మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ, అనకాపల్లి కలెక్టర్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు పలు క్రీడా పోటలతో పాటు క్విజ్, వాసరచన పోటీలు నిర్వహించనున్నట్టు అనకాపల్లి జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎల్.వి.రమణ ఓ ప్రకటనలో తెలిపారు. వాక్/రేస్, వాలీబాల్, హాకీ, మినీ ఫుట్‌బాల్ , బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్, చెస్, బాక్సింగ్, జూడో, వెయిట్ లిఫ్టింగ్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. విజేతలకు సర్టిఫికెట్లు అందజేయడంతో పాటు ప్రతిభ చూపిన క్రీడాకారులను, శిక్షకులను సత్కరించనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోటీల్లో పాల్గొనేందుకు అర్హతలు, ఇతర వివరాల కోసం 9963177814 ఫోన్ నంబర్లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

'బల్లా'కు విశిష్ట సేవా పురస్కారం



బల్లా నాగభూషణం

అనకాపల్లి : తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఈనెల 29న జరగనున్న సందర్భంగా విజయవాడ ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో 'జాతీయ స్థాయి కళా, సామాజిక సేవా రంగం విశిష్ట అవార్డు (గిడుగు రామమూర్తి) స్థానిక చిన్నరాజుపేటకు చెందిన సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు, విశ్రాంత జైల్ వార్డర్ బల్లా నాగభూషణంకు వచ్చింది. ఈ మేరకు ఆదివారం నాగభూషణం ఒక ప్రకటనలో ఈ విషయం పేర్కొన్నారు. 20 సంవత్సరాల క్రితం అసోసియేషన్ ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలు చేయడం వల్ల ఈ అవార్డు దక్కడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. నేటి యువత సేవా కార్యక్రమాలపై దృష్టి సాధించాలని ఆయన కోరారు.

నూకాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు



తులసిమాలల అలంకరణలో నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి : స్థానిక గవరపాలెం శ్రీ నూకాంబిక అమ్మవారిని శ్రావణమాసం మూడో ఆదివారం సందర్భంగా తులసిమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. విశాఖ ఉమ్మడి జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో బండారు ప్రసాద్ ఉచిత ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.

పోలీసు సెక్యూరిటీ అవసరం



ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, వైద్యసిబ్బంది కోసం పటిష్ట భద్రత కల్పించాల్సి ఉంది.ప్రభుత్వాలు కొన్ని రక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో తప్పనిసరిగా పోలీస్ ఆవుట్ పోస్టును ఏర్పాటు చేయాలి. రాత్రిపూట ప్రమాదాల్లో గాయపడిన వారితో పాటు చాలా మంది గుంపుగా వస్తుంటారు. క్షతగాత్రుడికి శాయశక్తులా మెరుగైన వైద్యం అందిస్తాం. కాని అనుకోని సంఘటనలు జరిగినప్పుడు మాత్రం రోగికి సంబంధించిన వారు వైద్యులపై దాడులు, గాయపరచడం చేస్తుంటారు. వీటిని అరికట్టేందుకు పోలీస్ సెక్యూరిటీ ఉంటే ధైర్యంగా ఉంటుంది. పని సమయాల్లో డ్యూటీ డాక్టర్లుకు విశ్రాంతి గదులు ఉండాలి. సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.

– **టి శశికాంత్**, డాక్టర్,పీహెచ్‌సీ వైద్యాధికారి, జి.మాడుగుల, అల్లూరి సీతారామరాజు జిల్లా



కఠిన శిక్షలు అమలు చేయాలి



కోల్‌కత్తాలో వైద్యురాలిపై జరిగిన దాడి అవమానవీయం.ప్రజల ప్రాణాలను కాపాడుతున్న వైద్యులు, సిబ్బందిపై దాడులు, హత్యలు తీవ్రమైన నేరంగా పరిగణించాలి. వైద్య రంగంలో ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి.వైద్యులు, సిబ్బందిపై ఇటీవల కాలంలో దాడులు అధికమయ్యాయి.దాడులు చేసిన వారికి కఠినంగా శిక్షలు ఉండాలి. అవి పక్కగా అమలు జరిగేలా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.శిక్షలు చూసి భవిష్యత్‌లో అత్యాచారాలు,హత్యలు,దాడులు చేసేందుకు భయం పట్టుకోవాలి.

– **గంపరాయి రాంబాబు**, సిబ్బంది, ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి, ముంచంగిపుట్టు

సంత.. సమస్యల చింత

- కానరాని షెడ్లు
- ఆరుబయటే వ్యాపారం
- వ్యాపారులు, వినియోగదారుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా దుకాణ సముదాయం



అధ్వానంగా ఉన్న షెడ్లు



పేరుకుపోయిన చెత్త

అరకులోయ రూరల్: నియోజకవర్గంలో పేరొందిన సుంకరమెట్ట వారపు సంతలో సమస్యలు కొట్టుమిట్టాడుతున్నాయి. రెండు దశాబ్దాల క్రితం ఇక్కడ వారపు సంత మార్కెట్‌ను నిర్మించారు. ప్రతి ఆదివారం ఇక్కడ సంత జరుగుతుంది. ఇక్కడి సంత పశువులు, మేకలు, గొర్రెల అమ్మకాలతో పాటు అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలకు పేరొంది. వర్షాకాలంలో సంత బురదతో చిత్తడిగా మారుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారస్తులు సంతకు అధికంగా వస్తుంటారు. సంతో ఉన్న దుకాణసముదాయం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. షెడ్లు లేక ఆరుబయటే వ్యాపారాలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. సంతలో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడంతో వ్యాపారులు, వినియోగదారులకు అవస్థలు తప్పడం లేదు. షెడ్లు లేకపోవడంతో వ్యాపారులు తమ సరకులు భద్రపరచుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. లక్షలాది రూపాయల లావాదేవీలతో ప్రతి వారం వ్యాపారం జరుగుతున్న సంతలో కనీస సౌకర్యాల కల్పనపై పంచాయతీ అధికారులు, పాలకవర్గం దృష్టి సారించడం లేదని పలువురు చెబుతున్నారు.

పేరుకుపోయిన చెత్తచెదారాలు

వారపు సంతలో రోజుల తరబడి చెత్త చెదరాలు పేరుకుపోవడంతో సంతలో వ్యాపారాలు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. తీవ్ర దుర్గంధంతో నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. సంతలో షెడ్లు లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో వ్యాపారులు అరకు–విశాఖ ప్రధాన రహదారిలో దుకాణాల ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి తప్పడం లేదు. ఆదివారం కావడంతో పాటు పర్యాటకుల వాహనాల తాకిడి ఎక్కువగా ఉండడంతో తరచూ ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. సంతలో నిరుపయోగంగా ఉన్న షెడ్లను మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకొస్తే వ్యాపారాలు చేసేకునేందుకు వీలుగా ఉంటుందని పలువురు చెబుతున్నారు.

నిధుల మంజూరు ప్రశార్థకం

సంతలో షెడ్లు మరమ్మతు పనులకు నిధుల కోసం ఏఎంసీ అధికారులు, పాలకవర్గ సభ్యులు తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినప్పటికీ నేటికి మంజూరు కాలేదు. వ్యవసాయ ఉత్పత్తులు మార్కెటింగ్ చేసేందుకు సౌకర్యం లేక వ్యాపారస్తులు, స్థానిక గిరిజన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నిధుల మంజూరు విషయం ప్రశ్నార్థకంగా మారిందని స్థానికులు చెబుతున్నారు.



ప్రధాన రోడ్డుపై తాత్కాలిక దుకాణాలు

ప్రతిపాదనలు పంపిస్తాం

సంతలో తాగునీటి సదుపాయం, మరుగదొడ్ల నిర్మాణంతో పాటు షెడ్ల మరమ్మత పనులకు నిధుల కోసం గతంలో తీర్మానం చేశాం. ప్రభుత్వం మారడంతో మరోసారి ఏఎంసీ పాలకవర్గం సంతలో సమస్యలపై తీర్మానం చేసి నిధుల కోసం ప్రతిపాదనలు పంపిస్తాం.

– జగ్గన్న, ఏఎంసీ కార్యదర్శి, అరకు నియోజకవర్గం

సమస్యలతో సతమతం



వారపు సంతలో ఎటువంటి సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. షెడ్లు లేక రహదారులపై వ్యాపారాలు చేసుకోవాల్సి వస్తోంది. వారపు సంతకు వచ్చిన వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంతలో తాగునీరు, మరుగుదొడ్లు అందుబాటులోకి తీసుకురావాలి.

–సూర్యం, రైతు, అరకులోయ మండలం

కనీస సౌకర్యాలు కల్పించాలి



సంతలో రైతులు తీసుకొచ్చిన అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను దళారీల బెడద లేకుండా చూడాలి. సంతలో సౌకర్యాలు కల్పించాలి. మార్కెటింగ్ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మైదాన ప్రాంతాల్లో రైతు బజార్లకు వెళ్లి విక్రయించుకోవాల్సి వస్తోంది. అధికారులు స్పందించాలి.

– సుంకరి అప్పన్న, రైతు, మాలిసింగరం, అరకులోయ మండలం

నిత్యావసర సరకుల పంపిణీ



నిత్యావసర సరకులు అందజేస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లి: విషాహారంతో అస్వస్థతకు గురైన బాధిత ఆదివాసీ విద్యార్థుల కుటుంబాలకు నిత్యావసర సరకులు, మందులను పంపిణీ చేసినట్టు తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ రామకృష్ణ మాట్లాడుతూ ఇటీవల కోటవురట్ల మండలంలోని కై లాసపట్నంలో మిషనరీ ఆశ్రమంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థి కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. మండలంలో అంజలి శనివారం, కిటుముల పంచాయతీల పరిధిలో పలు గ్రామాలకు చెందిన 16 మంది ఆదివాసీ విద్యార్థుల కుటుంబాలకు నిత్యవసరాలైన బియ్యం, కంది పప్పు, మందులు పంపిణీ చేశామన్నారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల సామాజిక తనిఖీ రేపు

రాజవొమ్మంగి: మండలంలోని ఏప్రిల్ 1, 2023 నుంచి 31 మార్చి, 2024 వరకు ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్టు ఏపీవో సురేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం ఉపాధి కార్యాలయ ఆవరణలో జరుగుతుందన్నారు. ఇప్పటికే మండలంలోని 19 పంచాయతీల్లో ఉపాధి గ్రామసభలు నిర్వహించి తుది నివేదికను ఈ కార్యాలయానికి అందజేశారన్నారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖాధికారులు, ఉపాధి సిబ్బంది, వేతనదారులు హాజరుకావాలని కోరారు.

జన్‌మన్ పథకంపై అవగాహన



గరుడ గ్రామానికి వెళ్లేందుకు కాలువ దాటుతున్న సర్పంచ్ చంద్రరావు, సచివాలయ సిబ్బంది



గ్రామస్తులతో సమావేశం నిర్వహిస్తున్న సిబ్బంది

కొయ్యూరు: మండలంలోని అంతాడ పంచాయతీలోని ఆదివాసీ గ్రామమైన గరుడలో జన్‌మన్ పథకంపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సర్పంచ్ సుర్ల చంద్రరావు, రావణాపల్లి ఎంపీటీసీ సభ్యురాలు ఇరువాడ సత్యవాణి, పంచాయతీ కార్యదర్శి లీలా ప్రసాద్, సచివాలయ పీఎస్ నాగమణి కాలినడక సుమారు ఏడు కిలోమీటర్లు ప్రయాణించారు. కొండలు, గెడ్డలు దాటుకొని గరుడ గ్రామానికి చేరుకున్నారు. ఆదివాసీలకు పీఎం జన్‌మన్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను వివరించారు. గ్రామంలో సుమారు 45 మంది ఆదివాసీలు 11 గృహాల్లో నివాసముంటున్నట్టు వారు చెప్పారు. గ్రామానికి రహదారి లేక పడుతున్న ఇబ్బందులను స్థానికులు వివరించారని, రోడ్డు సదుపాయం కోసం విన్నవించినట్టు వారు తెలిపారు.

భారీ వర్షం.. తీరని నష్టం



చెరకుంపాలెం వద్ద వరద నీటిలో వరి పంట

- వరద ముంపులో వరి పొలాలు
- కన్నీరుమున్నీరవుతున్న రైతులు

రాజవొమ్మంగి: మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు చెరకుంపాలెం వద్ద ఆరుగురు రైతులకు చెందిన సుమారు 30 ఎకరాల్లోని వరి పంట ఆదివారం నీట మునిగింది. శనివారం రోజంతా కురిసిన వర్షానికి ఈ ప్రాంతానికి చెందిన కొక్కెరగెడ్డ వాగు పొంగి ప్రవహించింది. ఒకేసారి వరద నీరు పొలాల మీదుగా ప్రవహించడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఈ విషయమై తహసీల్దార్ కరక సత్యనారాయణను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు. ఈ దశలో ఒకటి రెండు రోజులు వరి పొలంలో నీరు చేరడం వల్ల నష్టం ఏమీ ఉండదన్నారు. క్షేత్రస్థాయిలో పొలాలను పరిశీలించి నష్టం కలిగితే పరిహారం కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామన్నారు.



రోడ్డుపై బైఠాయించిన రైతులు

రైతుల ఆందోళన

తరచూ వర్షాలకు తమ పొలాలు నీట మునిగి పోవడానికి ఇక్కడ నిర్మాణంలో ఉన్న ఎన్‌హెచ్516ఈ రహదారి నిర్మాణ పనులే కారణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆందోళన చేసి రోడ్డుపై నినాదాలు చేసి బైఠాయించారు. ఈ ప్రాంతంలో పొలాల మధ్య నుంచి సాగిన జాతీయ రహదారి ఎత్తుగా నిర్మించారని, కాని వాగులు పొంగితే వరద నీరు పోయేందుకు తగిన ఏర్పాట్లు జరుగలేదన్నారు. కల్వర్టు నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

పేద మహిళలకు ఆర్థిక చేయూత



బుక్ కీపర్లకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



గంగవరంలో ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం

రాజవొమ్మంగి: డ్వాక్రా సంఘాల్లోని ప్రతి మహిళలను ఏడాదిలో లక్షాధికారిని చేయాలన్నదే ప్రధానమంత్రి మోదీ ప్రవేశపెట్టిన లక్‌పతి దీదీ పథకం లక్ష్యం అని రాజవొమ్మంగి వెలుగు ఏపీఎం ఆదినారాయణ అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఆదివారం ప్రధానమంత్రి మోదీ మహారాష్ట్ర జల్‌గావ్‌లో డ్వాక్రా మహిళలతో నిర్వహించిన సమావేశాన్ని జూమ్ మీటింగ్ ద్వారా మహిళలు తిలకించే ఏర్పాటు చేశారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఏపీఎం ఆదినారాయణ మాట్లాడుతూ పేద, నిరుపేద మహిళలను గుర్తించి వారికి వివిధ రకాల జీవనోపాధులు కల్పించడం ఈ కార్యక్రమం ప్రధానం ఉద్దేశ్యమన్నారు. ఇప్పటికే వెలుగు ద్వారా అమలవుతున్న అనేక పథకాలు వీరికి అనుసంధానం చేయడం జరుగుతుందన్నారు. సున్నా వడ్డీ ద్వారా రుణ సదుపాయం కల్పన జరుగుతుందన్నారు. ఇటువంటి జీవనోపాధుల ద్వారా నెలకు కనీసం రూ. 10వేలు సంపాదించుకునే అవకాశముందని ఆయన చెప్పారు. ఈ విధంగా ఏడాదిలో ప్రతి మహిళ చేతిలో రూ. లక్ష మిగులు ఉండాలని ప్రధానమంత్రి పిలుపు ఇచ్చారన్నారు.

జీవనోపాధుల కోసం ప్రతి గ్రామ సమాఖ్యకు రూ.10 లక్షల వరకు కార్పస్ ఫండ్ సమకూర్చనున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు రంపచోడవరం డివిజన్‌లోని 11 మండలాల్లో మారేడుమిల్లి, వై.రామవరం మండలాలకు ఈ విధంగా నిధులు సమకూరాయని, త్వరలో అన్ని వీఓలకు కార్పస్ ఫండ్ వస్తుందన్నాని మహిళలకు వివరించారు. సర్పంచ్ గొల్లపూడి రమణి, ఎంఎంఎస్ అధ్యక్షురాలు కొనకం వరలక్ష్మి బీజేపీ నాయకుడు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలు అందించినందుకు వీవోఏలకు ప్రశంసాపత్రాలు

లక్‌పతి దీదీ పథకంలో మహిళలను ఎన్‌రోల్ చేసే కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటున్న ఆరుగురు వీఓఏల(వెలుగు బుక్ కీపర్లు)కు ప్రజాప్రతినిధులు ప్రశంసాపత్రాలు అందజేశారు. అవార్డులు పొందిన వారిలో అక్కమ్మ, లావణ్య, వీణారాణి, రాజ్యలక్ష్మి, స్వర్ణలత, ప్రమీల, రత్నం, సత్యవతి, నాగమణి, గంగాభవానీ ఉన్నారు.

గంగవరం: గంగవరం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన లక్‌పతి దీదీ కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల మహిళాలు, ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జడ్పీటీసీ బేబీరత్నం , వైస్‌ఎంపీపీ గంగాదేవి, సర్పంచ్ కలుముల అక్కమ్మ, టీడీపీ పార్టీ అధ్యక్షుడు పాము అర్జున్‌లు పాల్గొన్నారు.మహిళాలకు, సీఆర్‌పీలకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఆకట్టుకున్న రంగవల్లుల పోటీలు

దేవరాపల్లి: దేవరాపల్లిలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన రంగవల్లి పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ముగ్గుల పోటీల్లో 30 మంది మహిళలు, బాలికలు పాల్గొన్నారు. శ్రీకృష్ణ ఆలయ ప్రాంగణంలో అద్భుతంగా వేసిన రంగు రంగుల ముగ్గులను స్థానిక ప్రజలు తరలివచ్చి ఆసక్తిగా తిలకించారు. విజేతలకు బహుమతులుగా కూలర్, ఫ్యాన్, గ్యాస్ స్టౌ, హాట్ బాక్స్‌లను అందజేశారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు సత్యనారాయణ, సాగర్‌కుమార్ వ్యవహరించారు.

సందడే.. సందడి

- ఉద్యోగులు, ప్రజాప్రతినిధుల ఆత్మీయ కలయిక
- డల్లాపల్లిలో పిక్నిక్



కార్యక్రమానికి హాజరైన అధికారులు, గ్రామ సచివాలయ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు



మ్యూజికల్ చైర్ ఆడుతున్న మహిళా ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది



టగ్ ఆఫ్ వార్‌లో గ్రామ సచివాలయ ఉద్యోగులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు

పాడేరు: ఒకరు ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు.. మరోకరి కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించిన ఉద్యోగులు, వీరంతా తమ విధుల్లో తీరిక లేకుండా గడుపుతారు. వీరిని ఆనందింపచేయటానికి ఎంపీడీవో సాయి నవీన్ ఆధ్వర్యంలో మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన డల్లాపల్లిలో ఆత్మీయ కలయిక విడిది ఏర్పాటు చేశారు. వారంతా ఆదివారం ఒక చోటుకు చేరారు. మండలంలోని 26 పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఒక టీమ్‌గా మండల పరిషత్ ఉద్యోగులు, సిబ్బంది, గ్రామ సచివాలయ ఉద్యోగులు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది ఒక టీంగా ఏర్పడ్డారు. వీరికి మ్యూజికల్ చైర్, టగ్ ఆఫ్ వార్, డాన్స్ తదితర పోటీలను నిర్వహించారు. అనంతరం వీరంతా కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం డల్లాపల్లి పర్యాటక ప్రాంత పరిసరాల్లో ఫొటోలు దిగుతూ సందడి చేశారు. దీంతో ఆదివారం డల్లాపల్లి ప్రాంతమంతా సందడి నెలకొంది.